వ్యాధులకు చక్కటీ కార్యాచరణ

- పాడి పశువులకు గాలికుంటు వ్యాక్సిన్లు తప్పనిసరి
- జబ్బవాపు, గొంతువాపు వ్యాధులు రాకుండా చర్యలు
- వైద్య సిబ్బంది సూచనలతో నివారణ


బెండపూడిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న వెటర్నరీ వైద్య సిబ్బంది

తొండంగి: తొలకరి వర్షాలు ప్రారంభమైనప్పటి నుంచి పాడిపశువుల్లో ప్రాణాంతక గొంతు(గురక) వాపు, జబ్బవాపు వ్యాధులు రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు వేయించాలని మండల పశువైద్యాధికారి బి.చైతన్య తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి పశువులు, పాల వ్యాపారంపై ఆధారపడి ఎన్నో లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 2 లక్షలు గేదెలు, 76వేలు ఆవులు ఉండగా తొండంగి మండలంలోని పశువులు 26,711 వరకూ ఉన్నాయి. ప్రభుత్వం గ్రామాల్లో పాడి పశువులున్న ప్రతీ ఇంటికీ వెళ్లి గాలికుంటు వ్యాధి రాకుండా నివారణకు వ్యాక్సిన్లు వేసేందుకు తగిన ఏర్పాట్లు చేసింది. విడతల వారీగా అన్ని పాడిపశువులకు వెటర్నరీ అసిస్టెంట్లు వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నారు. పాడిరైతులు పశు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

జబ్బవాపు వ్యాధి వ్యాప్తి

జబ్బవాపు(బ్లాక్వాటర్) వ్యాధి పశువు సప్ప, కండరాల్లో వ్యాధి కలిగించే బ్యాక్టీరియా (క్లాస్ట్రీడియంచోవియే) రక్తంలోకి చేరి తొడ, భుజ, ఛాతి కండరాల్లోకి చేరి కుళ్లిపోయేలా చేస్తుంది. జబ్బవాపు వద్ద నొక్కడం ద్వారా కరకర శబ్దం(క్రిపిటేటింగ్ సౌండ్స్) ద్వారా గుర్తించవచ్చు.

లక్షణాలు

పశువులకు అందించే కలుషిత నీరు, ఆహారం, దెబ్బతిన్న గాయాలతో ఆరోగ్యంగా ధృడంగా ఉన్న ఆరు నెలల నుంచి రెండేళ్ల వయస్సు గల లేగ దూడల్లో వస్తుంది. గేదల్లో కన్నా ఆవుల్లోనే ఎక్కువగా వ్యాపిస్తుంది. జూన్ మొదటి వారం నుంచి సెప్టెంబర్ మధ్య వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన పశువుల్లో గుండె వేగం ఎక్కువగా ఉండటం, ఆకలి మందగించడం, 108 డిగ్రీల జ్వరం, ఆహారం తినకపోవడం, నెమరు వేయకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. పశువుల్లో పై లక్షణాలు గుర్తించి 12 గంట నుంచి 24 గంటలలోపు గుర్తించి వైద్యం అందించాలి. కండరాల్లో కుళ్లిన ప్రాంతాన్ని తొలగించి యాంటీబయెటిక్స్ అందించి చికిత్స అందించాలి. లేకుంటే వెంటనే చనిపోయే అవకాశం ఉంది.

గొంతువాపు వ్యాధికి కారణాలు

తొలకరి వర్షాలు పడినప్పుడు పాశ్చురెల్లా హిమోలైటికా బ్యాక్టీరియా వల్ల ఈవ్యాధి వ్యాపిస్తుంది. దీనినే గొంతు వాపు వ్యాధి, గురక జబ్బు, కంత మాద, ఎర్రదొమ్మ, కుత్తుక వాపు, గురక తెగులు అని ఆయా ప్రాంతాల్లో ఉన్న భాషకు అనుగుణంగా ఈపేర్లుతో పిలుస్తారు. ఒక పశువు నుంచి మరొక పశువుకు వ్యాపిస్తుంది. వాతావరణ మార్పుతో పాటు అపరిశుభ్ర నీరు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వంటి కారణాలతో ఈవ్యాధి వస్తుంది. ముఖ్యంగా రెండు నుంచి నాలుగు సంవత్సరాల గల పెయ్యల్లో వ్యాధి వస్తుంది. వీటితోపాటు ఆవులు, మేకలు, గొర్రెలు, గాడిదలు పాశ్చురెల్లా హిమోలైటికా అనే సూక్ష్మజీవి వలన ఈ వ్యాధి కలుగుతుంది.

వ్యాధి వ్యాప్తి

తాగునీరు, కలుషిత వాతావరణం, అనారోగ్య పశువుల స్పర్శ, మేత, పరికరాలు, ఈగలు, జోరీగల ద్వారా ఈ వ్యాధి వేగంగా వ్యాపిస్తుంది. ముఖ్యంగా వరదల కారణంగా నిలిచిపోయిన మురుగునీటిలో, అపరిశుభ్ర పశువుల పాకలు, వాటి పరిసరాలు ఈ వ్యాధి వ్యాప్తికి ప్రధాన కారకాలు. ఈ వ్యాధి ముఖ్యంగా శ్వాస వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. పశువుల గొంతు, మెడ కింది భాగంలో వాపు కనిపిస్తుంది.

వ్యాధి లక్షణాలు

మేత, నెమరు మందగించుట, పాలు నిలిచిపోవుట, గొంతు కింది భాగంలో జలవాపు ప్రారంభమై క్రమంగా మెడ కింది భాగానికి, ఆ తర్వాత కాళ్ల మధ్య ఎదురు రొమ్ము కిందికి చేరుతుంది. పశువు తీవ్రమైన ఆయాసంతో రొప్పుతూ గురకపెడ్తూ ముక్కు నుంచి, నోటి నుంచి నురగ వంటి స్రావాలను కారుస్తుంటుంది. చెవి ప్రాంతంలో విపరీతమైన వేడి ఉంటుంది. కళ్లు ఎర్రగా మారుతాయి. కొన్ని సందర్భాల్లో చాక్లెట్ రంగులో కనిపిస్తాయి.

వ్యాధి నిర్ధారణ

ఈ వ్యాధికి గురైనట్లు తెలుసుకునేందుకు పశువుల రక్తపు నమూనాలు సేకరించి పరీక్షలు చేయడం ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు. సకాలంలో సరైన చికిత్స అందించడంతోపాటు టీకాలు వేయడం వంటి నివారణ చర్యలు తీసుకోవాలి. శరీరం లోపలి అవయవాల్లో కనిపించే మార్పుల వల్ల కూడా వ్యాధి నిర్ధారణ చేస్తే మరీ మంచిది. ల

కచ్చితంగా వ్యాక్సిన్‌వేయించాలి



పాడిపశువుల్లో గొంతువాపు, జబ్బవాపు వ్యాధులు రాకుండా టీకాలు అందుబాటులో ఉన్నాయి.. వెటర్నరీ అసిస్టెంట్లు పశువులున్న ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్లు వేస్తున్నారు. ప్రతీ పశువుకు కచ్చితంగా ఈ ప్రాణాంతక వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేయించాలి. గ్రామాల్లో ప్రక్రియను ప్రారంభించడం జరిగింది. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

–బి.చైతన్య, పశువైద్యాధికారి, తొండంగి మండలం

నివారణ చర్యలు

ఈ వ్యాధికి గురైన పశువును గుర్తించగానే మిగతా పశువులకు దూరంగా ఉంచాలి. పశువుల పాకల్లోకి క్రిమికీటకాలు చేరకుండా శుభ్రంగా ఉంచాలి. పౌడిసున్నం, గెమాక్సిన్, డీడీటీ, సైపర్‌మెత్రిన్, డెల్టామెత్రిన్ వంటి కీటకనాశకాలను స్ప్రే చేయాలి. చనిపోయిన పశువుల కళేబరాలను, వాటి వ్యర్థాలను కొట్టాలకు దూరంగా భూమి లోతుగా తవ్వి పాతిపెట్టాలి. వీటిని పచ్చికబీడ్లు, పంట భూములు, చెరువులు, వాగులు, కాల్వల్లోకి వదలకుండా చూసుకోవాలి. వానాకాలం రాగానే పశువుల్లో గురక వ్యాధి లేదా గొంతు వాపు వ్యాధి రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు అప్రమత్తంగా ఉండాలి. సకాలంలో చికిత్స అందిస్తే ఇతర పశువులకు ఈ వ్యాధి సోకకుండా చూడవచ్చు.

క్లుప్తంగా

భగవద్గీతపై పట్టు సాధించాలి


ఏలేశ్వరంలో స్వరాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న పరిషత్ సభ్యులు

ఏలేశ్వరం: ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత పోటీల్లో ప్రథమస్థానం సాధించిన స్వరాజ్యలక్ష్మిని పట్టణంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణ ఆలయంలో స్వరాజ్యలక్ష్మిని శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా పరిషత్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎడివి ప్రసాద్, కటకం కిరిటీ మాట్లాడుతూ భగవద్గీతపై ప్రతి ఒక్కరూ పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో గుమ్మాల గిరిజ, తూమురౌతు గురయ్య, ఇందిరా, దేవి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణపనులు పరిశీలించిన ఎంపీపీ


యర్రవరంలో నిర్మాణపనులు పరిశీలిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద నిర్మాణ పనులను ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి శుక్రవారం పరిశీలించారు, మండల నిధులతో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పార్కింగ్ టైల్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రత్యేకత సంతరించుకున్న ప్రసన్నాంజనేయ స్వామి అతిభారీ విగ్రహం వద్ద భక్తుల సౌకర్యార్థం వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామరాజువర్మ, మైరాల కనకరావు, బసాప్రసాద్, నీరుకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలు అవసరం


ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో పాల్గొన్న ఆదిత్య అధ్యాపకులు

గండేపల్లి: విద్యతోపాటు మానవతా విలువలు అవసరమని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో.చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో 8 రోజుల పాటు జరగనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారం ప్రారంభించినట్టు ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల్లో మానవతా విలువలు పెంపొందించడానికి ఫ్యాకల్టీ తోడ్పాటు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీటీఈ ప్రతినిధి ప్రొఫెసర్ ఎస్.సునిల్ కుమార్, వైస్ చాన్సలర్ ఎంబి శ్రీనివాస్, డీన్.వానతి, ఆర్ సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో అన్నసమారాధన

ఏలేశ్వరం: శ్రీ అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణ స్వామి పాంచాహ్నిక వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా పట్టణంలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక పల్లపు వీధిలోని స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాలు తమ సేవలు అందించారు. అన్నవరం దేవస్థానం సిబ్బంది ఆధ్వర్యంలో అన్నదానం పర్యవేక్షించారు. పట్టణంలోని పలుప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యదీక్షల ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు, మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి, అన్నవరం దేవస్థానం సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఎన్‌సీసీ సంయుక్త వార్షిక శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్టు క్యాంపు కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ పి.ప్రవీణ్ బాబు శుక్రవారం తెలియజేశారు. సుమారు 400 మంది క్యాడెట్లతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈనెల 20 వరకు జరుగుతుందని, వివిధ సంస్థల నుంచి పాల్గొన్న క్యాడెట్లతో ఐక్యత, వైవిధ్యాన్ని సూచిస్తు, జాతీయ సమైక్యత స్ఫూర్తిని బలపరుస్తుందన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

గండేపల్లి: మండలంలోని మురారి గ్రామ శివారులో శుక్రవారం పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్‌లో నిర్వహించారు. ఇందులో భాగంగా సారా తయారీకి ఉపయోగించే 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, ఐదు లీటర్ల సారాతో ఓ వ్యక్తిని అరెస్ట్‌చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు. 122 ద్విచక్ర వాహనాలను తనిఖీచేసి వాటిలో రికార్డ్సు లేని 8 వాహనాలను సీజ్ చేసినట్టు వెల్లడించారు.

వేలిముద్ర పూర్తి చేసుకోవాలి

రైతన్నలకు తుది గడువు


మల్లేపల్లిలో రైతు సేవాకేంద్రంలో వేలిముద్రకోసం వేచిఉన్న రైతులు

గండేపల్లి: పీఎం కిసాన్‌కు అర్హత పొందేందుకుగాను ఈ నెల 20 లోపు వేలిముద్రలు పూర్తి చేసుకోవాలని వ్యవసాయాధికారి సద్గురుమూర్తి రైతులకు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కార్యాలయంలో పలువురు స్థానిక రైతులతో మాట్లాడుతూ అన్నదాత–సుఖీభవ–పీఎం కిసాన్–2025–26 వార్షిక పథకంలో భాగంగా అర్హత కలిగిన ప్రతి రైతు మీ సేవా కేంద్రంలో వేలిముద్రలు పూర్తిచేసుకుంటే పథకం వర్తిస్తుందన్నారు. అనంతరం పథకం ఆవశ్యకతను వివరించారు.

కాపు సంఘం యువత అధ్యక్షుడి ఎన్నిక


సైతిన నాగేశ్వరరావు

జగ్గంపేట: భారతీయ కాపు సేవా సమితి రాష్ట్ర యువత అధ్యక్షుడిగా జగ్గంపేట మండలం జె.కొత్తూరు గ్రామానికి చెందిన సైతిన నాగేశ్వరరావు నియిమితులయ్యారు. ఈ మేరకు ఆయన జగ్గంపేటలో శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సేవా సమితి జాతీయ అధ్యక్షుడు కాలవ వెంకటేశ్వరరావు నియామక ప్రతాలను అందచేశారన్నారు. తనను ఈ పదవికి ఎంపిక చేసిన వెంకటేశ్వరరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పదవికి న్యాయం చేస్తానని, సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం


ముదునూరి కృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసు పెట్టి అరెస్టు చేయడాన్ని తప్పుపడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలోని ఆయన స్వగ్రామంలో ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ముందు రెడ్‌బుక్ రాజ్యాంగం వేధింపులు చెల్లవని, కొమ్మినేని అక్రమ కేసు విషయంలో తేట తెల్లమైందన్నారు. సుప్రీం తీర్పు రెడ్‌బుక్ రాజ్యాంగానికి చెంపపట్టు లాంటిదన్నారు. మరో వ్యక్తి చేసిన వ్యాఖ్యలకు టీవీ యాంకర్ ఎలా బాధ్యులవుతారు, నవ్వినంత మాత్రాన అరెస్టు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఎదురుదెబ్బ


కిర్లంపూడిలో గిరిబాబును కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

కిర్లంపూడి: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్ అక్రమ అరెస్టుపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో కూటమి ప్రభుత్వం రచించిన రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఎదురు దెబ్బ తగిలిందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. కొమ్మినేని శ్రీనివాస్‌ను విడుదల చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం అన్నవరం, సిరిపురం గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం నివాసంలో గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలు రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో చేస్తున్న విధ్వంసాన్ని గమనిస్తున్నారని సరైన సమయంలో కూటమికి బుద్ధిచెబుతారని ఆయన దుయ్యబట్టారు. కార్యక్రమంలో సరమర్ల మధుబాబు, గణేశుల లక్ష్మణస్వామి, గొల్లపల్లి కాశి, మాజీ సర్పంచ్ మజ్జూరి సూర్యనారాయణ, మజ్జూరి రామలింగేశ్వరరావు, సోము సూర్యుడు తదితరులు ఉన్నారు.

విమాన మృతులకు నివాళులు


ఏలేశ్వరంలో మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఏలేశ్వరం: అహ్మదాబాద్‌లో జరిగిన విమానప్రమాదంలో మృతిచెందిన వారికి పట్టణంలో శుక్రవారం కన్నీటి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చౌక్ వద్ద ప్రధాన రహదారిపై కొవ్వొత్తులతో ర్యాలీ చేసి శద్ధాంజలి ఘటించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ విమాన ప్రమాదం ఎంతగానో కలచివేసిందని ప్రమాదంలో 240 మందికి పైగా చనిపోవడం బాధాకరమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్రప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యచరణ కార్యదర్శి సామంతుల సూర్యకుమార్, జిల్లా అధికార ప్రతినిధి సుంకర రాంబాబు, శిడగం వెంకటేశ్వరరావు, కోరాడప్రసాద్, పైల విజయ్‌కుమార్, వాగు బలరామ్, గోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకొండ భూములను పేదలకు అందించాలి


అడ్డుకొండ భూమిలో పేదలతో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నేతలు

జగ్గంపేట: జగ్గంపేట,గండేపల్లి మండలాల పరిధిలో మల్లిసాల, గోపాలపురం గ్రామాల మధ్య ఉన్న వందలాది ఎకరాల అడ్డుకొండ భూములను ఏలేటి కుటుంబం విక్రయించకుండా అడ్డుకుని కాపాడింది, రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలోని పేద ప్రజలేనని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకులు వీరాంజినేయులు తెలిపారు. అడ్డుకొండ భూములను తక్షణం పేదలకు పంపిణీ చేయాలని కోరూతూ భూముల్లో రెండు గ్రామాల ప్రజలతో శుక్రువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి,రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అడ్డుకొండ భూమిని పేదలకు పంపిణీ చేయడానికి జరుగుతున్న జాప్యం తదితర పరిణామాలపై సమిక్ష నిర్వహించారు. కర్నాకుల వీరాంజినేయులు మాట్లాడుతూ ప్రభుత్వ పోరంబోకు భూమిగా వున్న అడ్డుకొండ భూములకు, ఏలేటి కుటుంబానికి సంబంధం లేదని గరిమిల సీసీఎల్ఎ కోర్టు ఏలేటి ఫ్యామిలికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిందన్నారు. నాలుగు దశాబ్దాలుగా భూముల కోసం పోరాడుతున్న మల్లిసాల, గోపాలపురం గ్రామాల్లోని పేద ప్రజలకు తక్షణం అడ్డుకొండ భూములు పంపిణీ చేయాలని దీనికి అధికారులు ,ప్రజాప్రతినిధులు సహకరించాలని తెలిపారు. భూములు పంచేవరకూ రైతు కూలీ సంఘం పోరాటం సాగిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీసంఘం రాష్ట్ర నాయుకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసుల కార్డన్ సెర్చ్


జగ్గంపేట జ్యోతుల కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

జగ్గంపేట: జగ్గంపేట గ్రామంలో అపరచితులకు ఇళ్లు అద్దెకు ఇచ్చేటపుడు అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేట నెహ్రూ కాలనీ, టీచర్స్ కాలనీలో శుక్రువారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జగ్గంపేట సర్కిల్ పరిధిలోని ముగ్గురు ఎస్సైలు, సిబ్బంది, ప్రత్యేక పోలిసు బృందం ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. 122 వాహనాలు రికార్డులు పరిశీలించి రికార్డులేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితుల ఇళ్ల వద్ద వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఐ మాట్లాడుతూ అపరిచితులకు ఇళ్ల అద్దెకు ఇచ్చేటపుడు వారి వివరాలను పూర్తిగా అడిగి తెలుసుకుని నిర్ధారించుకోవాలన్నారు. అద్దెకు దిగేవారు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, నిషేధిత వస్తువులు నిల్వచేసినా చట్ట పరంగా తీసుకునే చర్యలకు, ఇంటి యజమానులు ఇబ్బందులు పడవలసి వస్తుందని చెప్పారు. వ్యభిచార గృహాలకు ఇళ్లు అద్దెకు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అపరచిత వ్యక్తులు తిరుగుతున్నా, ఎవరైనా గంజాయి అమ్మినా, సేవించినా, మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఆకతాయలు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, కిర్లంపూడి ఎస్సై జి.సతీష్, గండేపల్లి ఎస్సై.శివనాగ బాబు, ప్రత్యేక పోలీసు సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెంలో గ్రామంలో సీఐ బి.సూర్య అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం అనుమానిత వ్యక్తుల నివాస ప్రాంతాల్లో (కార్డన్ చర్చ్ ఆపరేషన్) తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాత కేసుల్లో ముద్దాయిగా ఉండి, తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. అమ్మకాలకు సిద్ధంగా ఉంచిన 30 లీటర్ల సారాను గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అనుమానస్పద వ్యక్తుల వివరాలను అడిగి నమోదు చేసి, గ్రామంలో ప్రజలకు అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అసాంఘిక కార్యకలపాలను గుర్తిస్తే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఈ ఆపరేషన్‌లో కాకినాడ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మౌనిక, ఎక్సైజ్ ఎస్సైలు నరసింహారావు, వంశీ రామ్, ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మి, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తొండంగి: మద్యం మత్తులో పురుగుల మందు సేవించగా వైద్యం పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై బి.జగన్మోహన్‌రావు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బుచ్చియ్యపేట గ్రామానికి చెందిన యుడికి నాగలోవ గోపి (35) రెండు రోజుల క్రితం మద్యం మత్తులో ఉండగా మనస్తాపానికి గురై పురుగు మందు సేవించాడు. దీంతో అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జగన్మోహన్‌రావు వివరించారు. మృతుడికి భార్య నాగ మంగ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ట్రైల్ రన్‌ను విజయవంతం చేయండి

కోటనందూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నిర్వహించే యోగా ట్రైల్ రన్‌ను విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ట్రైల్‌రన్ నిమిత్తం కోటనందూరు మండలంలో 135 వేదికలు ఏర్పాటు చేశామన్నారు. మండల కేంద్రం కోటనందూరుతో పాటు అన్ని గ్రామాల్లో నేడు ఉదయం ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ నిర్వహించే ఈ ట్రైల్‌రన్ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గోవాలని విజ్ఞప్తి చేశారు.

16న మండల సమావేశం

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో చేపట్టవలసిన వివిధ అభివృద్ధి పనులు, నిధులు వంటి అంశాలపై ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో చర్చించేందుకు ఎంపీటీసీలు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శిలు విధిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

ట్రెజరీ ఆఫీసర్‌కు సత్కారం


జహీరుద్దీన్‌ను సత్కరిస్తున్న పెన్షనర్ల సంఘం సభ్యులు

జగ్గంపేట: జగ్గంపేట సబ్‌ట్రెజరీ ఆఫీసర్‌గా పనిచేసిన ఎం.డి జహీరుద్దీన్ కాకినాడలోని జిల్లా ట్రెజరీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.పెద్దాపురం ట్రెజరీ ఆఫీసర్‌గా పనిచేసిన నజీరా బేగం జగ్గంపేటలో ట్రెజరీ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. జగ్గంపేట ట్రెజరీ ఆఫీసులో పనిచేసిన జూనియర్ అసిస్టెంట్ బి.రాజారావు,డేటా ఎంట్రీ పి.ప్రసాద్ బదిలీ కాగా వారి స్థానంలో అనురాధ, ఏ.ఆదినారాయణలు బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు బదిలీపై వెళ్తున్న ట్రెజరీ ఆఫీసర్ ఎం.డి జహీరుద్దీన్‌ను శుక్రవారం స్థానిక స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్, రిటైర్డు ఎంప్లాయిస్ సంఘాలు ఘనంగా సత్కరించాయి. ఆయన సేవలను సభ్యులు కొనియాడారు. విధినిర్వహణలో ఆయన చూపించిన ఓర్పు, ఆదరణ మరువలేమని రిటైర్డు ఉద్యోగులు,ఉపాధ్యాయులు ప్రసంసించారు.రిటైర్డు ఎంప్లాయిస్ సంఘం నేత మారిశెట్టి భద్రం మాష్టారు తదితరులు పాల్గొన్నారు.